## హెచ్‌ఎండీఏ.. వెబ్ సైట్ అప్‌డేట్

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హెచ్‌ఎండీఏలో అధికారుల బదిలీలు, రాజీనామాలు, తొలిగింపు వంటివి జరిగాయి. సంస్థలో జరిగిన మార్పులను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో మాత్రం అప్‌డేట్ చేయలేదు. ఇదే విషయమై 'హెచ్‌ఎండీఏ అప్‌డేట్ కాలే' శీర్షికన నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది.ఈ కథనానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అధికారులు స్పందించారు. హెచ్‌ఎండీఏ ఐటీ విభాగం అధికారులు ఇటీవల కాలంలో జరిగిన ఉన్నతాధికారుల బదిలీలు, ఇతర సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేశారు.



శనివారం జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , చిత్రంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణు తదితరులు

# పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్సే.. తెలంగాణ గళం

- 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ
- కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి ఒక్క పనైనా చేసిండా?
- బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- యూసుఫ్‌గూడలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం

**ఆ రెండు పార్టీలది ఫెవికాల్ బంధం**

*కాంగ్రెస్ పార్టీని నమ్ముకొంటే కుక్క తోకను పట్టుకొని గోదారి ఈదినట్లే. అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తుంది. అది దాని నైజం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ మంచి అవగాహనతో పని చేస్తున్నాయి. ఆ రెండు పార్టీలది ఫెవికాల్ బంధం.*

*- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్*

జూబ్లీహిల్స్, జనవరి 27 : అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్‌ఎస్ అఖండ మెజార్టీతో జయకేతనం ఎగురవేసిందని, అదే మాదిరిగా రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ గులాబీ జెండా రెపరెపలాడించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. యూసుఫ్‌గూడ మహమూద్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో మొదటి నుంచి సరైన వ్యూహాన్ని రూపొందించుకుంటే బ్రహ్మాండమైన మెజార్టీ సాధిస్తామన్నారు. ఆరు గ్యారెంటీలతోపాటు ప్రాతిపదికలేని 420 హామీలు ప్రకటించి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని అన్నారు. అంబర్‌పేట అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాడనే సానుభూతితో ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా సికింద్రాబాద్, జూబ్లీహిల్స్‌కు ఒక్క పనైనా చేసిండా? అని ప్రశ్నించారు. ఈసారి ఎన్నికల్లో కిషన్‌రెడ్డికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. బీజేపీ వాళ్లు ఎంతసేపు దేవుడు పేరు చెప్పి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తారని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, అందుకే ప్రజలు ఆయన్ని ప్రియమైన ప్రధాని అని కాకుండా పిరమైన ప్రధానిగా అభివర్ణిస్తారని అన్నారు. చట్ట సభల్లో తెలంగాణ గళం వినిపించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అభివృద్ధి సాధించేందుకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తప్పనిసరని, అందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో విజయం సాధించేలా ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాల ప్రకాశ్, సొహైల్ భాయ్, కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు విజయ్, వనం సంగీత యాదవ్, డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, ప్రదీప్ కుమార్, కృష్ణమోహన్, డివిజన్ నాయకులు విజయ్‌కుమార్, కో ఆర్డినేటర్ విజయసింహా రెడ్డి, నర్సింహారెడ్డి, బసవరాజు,నజీర్, డాక్టర్ అఫ్తాబ్, రామకృష్ణ, షరీఫ్, జావీద్, బషీర్, నర్సింగ్ దాస్, మధు యాదవ్, వేణు, అరుణ్, రాకేశ్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మహిళలే పార్టీకి పట్టుగొమ్మలు..



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి మహిళలే పట్టుగొమ్మలు. ఎన్నికలు ఏవైనా కష్టపడి పార్టీని గెలిపించిన ఘనత వారికే దక్కుతుంది. అధికారంలో లేకున్నా ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు పాటుపడుతున్న కార్యకర్తలకు అండగా ఉంటా. గత పార్లమెంట్ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచే బీఆర్‌ఎస్‌కు ఎక్కువ మెజార్టీ వచ్చింది. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి.

**- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, జూబ్లీహిల్స్**

### కాంగ్రెస్‌పార్టీ మోసానికి మారుపేరు



కాంగ్రెస్ పార్టీ మోసానికి మారుపేరు. ఐదు దశాబ్దాలు కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తే ఒక్కరోజులో నా కుటుంబానికి విలువ లేకుండా చేశారు. నా రాజకీయ జీవితం ముగిసిందనుకున్న దశలో కేసీఆర్ పిలిచి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. అందుకు బీఆర్‌ఎస్ పార్టీకి నమ్మకంగా ఉంటా. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా కనపడొద్దు అదే కసితో పని చేస్తా.

**- మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి**



యూసుఫ్‌గూడలో శనివారం జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు



శతచండీయాగం సందర్భంగా శనివారం అలంకృతమైన బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం

## ఎల్లమ్మ తల్లికి కుంభాభిషేకం

అమీర్‌పేట్, జనవరి 27 : బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో అయిదు రోజుల పాటు జరుగనున్న శతచండి యాగ సహిత మహాకుంభాభిషేక మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ వేద పండితులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు వెంకటరమణ శర్మ, రామనాథ శర్మ, రాజీవదత్త తదితరులు శతచండీ యాగ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మహా కుంభాభిషేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈవో కుంట నాగరాజు, చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్ కోరారు.

## సిటీ ట్రాఫిక్‌పై సీఎం సీరియస్

### ట్రాఫిక్ నియంత్రణపై పోలీసుల ఫోకస్

**అన్ని ప్రభుత్వ విభాగాలతో నగర కొత్వాల్ సమావేశం**

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : మహానగరాన్ని పీడిస్తున్న ట్రాఫిక్ సమస్యపై సీఎం సీరియస్ అయ్యారు. దీంతో పోలీసు యంత్రాంగం ట్రాఫిక్‌పై ఫోకస్ పెట్టింది. శనివారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, హెచ్‌ఎండీఏ కమిషనర్ దాన కిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, ఇతర విభాగాల అధికారులు, హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, మెట్రో రైలు, జలమండలి, ఎలక్ట్రిసిటీ శాఖలకు చెందిన అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు అన్ని శాఖల అధికారుల సలహాలు, సూచనలతో ప్రత్యేక ప్రణాళికను రూపొందించేందుకు పోలీసు యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది.

## లేడీస్ హాస్టల్‌లో అర్ధరాత్రి ఆగంతకులు

### సికింద్రాబాద్ పీజీ కళాశాలలో ఘటన

**దేహశుద్ధి చేసిన విద్యార్థినులు**

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ)/ ఉస్మానియా యూనివర్సిటీ, బేగంపేట్/కంటోన్మెంట్, జనవరి 27 : సికింద్రాబాద్ పీజీ కళాశాల లేడీస్ హాస్టల్‌లోకి శుక్రవారం అర్ధరాత్రి చొరబడిన వ్యక్తిని బేగంపేట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శివరాంపల్లి నివాసి అయిన శ్రీకాంత్ (35) గతంలో సికింద్రాబాద్ రసూల్‌పుర బాలంరాయి నీటి పంప్ హౌస్‌లో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేశాడు. ఇతని భార్య రసూల్‌పురలో ఉండడంతో శ్రీకాంత్ కూడా అత్తగారి ఇంటివద్దనే ఉంటున్నట్టు తెలిసింది. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు పీజీ కాలేజ్ లేడీస్ హాస్టల్ స్నానాల గది కిటికీలో నుంచి చూస్తూ విద్యార్థినులకు అసభ్య సైగలు చేశాడు. విద్యార్థినులు కేకలు వేయగా పారిపోయేందుకు ప్రయత్నించగా, సెక్యూరిటీ సాయంతో విద్యార్థినులు వెంబడించి ఆగంతకుడికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. నిందితుడు మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు 'వీ వాంట్ జస్టిస్' అంటూ విద్యార్థుల నినాదాలతో పీజీ కళాశాల ప్రాంగణం హోరెత్తింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తిని తరలించకుండా విద్యార్థులు తమ నిరసనతో అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న నార్త్ జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని విద్యార్థులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

### ఓయూలో వీసీ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ లేడీస్ హాస్టళ్లలో విద్యార్థినులకు రక్షణ కల్పించలేని వీసీ ప్రొఫెసర్ రవీందర్‌యాదవ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తక్షణమే రాజీనామా చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ పీజీ కళాశాల లేడీస్ హాస్టల్‌లోకి ఆగంతకుల ప్రవేశానికి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రొఫెసర్ రవీందర్‌యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూఐ, అంసా, ఎంఎస్‌ఎఫ్, ఏఎస్‌ఏ, టీవీఎస్‌యూ, టీఎస్‌ఎఫ్, ఏఎస్‌ఎఫ్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### గాల్లో దీపంలా విద్యార్థినుల భద్రత



కాంగ్రెస్ పాలనతో విద్యార్థినిల భద్రత గాల్లో దీపంగా మారుతున్నది. అందుకు నిదర్శనం సికింద్రాబాద్‌లోని ఉస్మానియా పీజీ లేడీస్ హాస్టల్ ఘటన. మొన్న ఓయూలో.. నిన్న సికింద్రాబాద్‌లో అమ్మాయిల వసతి గృహంలోకి దుండగులు చొరబడ్డారు. అమ్మాయిలు అప్రమత్తంగా ఉండి ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారి ధైర్య సాహసాలను అభినందిస్తున్నాను. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

**- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



సికింద్రాబాద్ పీజీ కళాశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థినిలతో మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని

## ఓలా ఈ బైక్స్ ₹5/కి.మీ

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : సిటీలో రైడ్ కోసం ఓలా కొత్తగా ఈ-బైక్ సేవలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. రైడ్ హెయిలింగ్ ప్లాట్‌ఫామ్ కింద ఢిల్లీ, హైదరాబాద్‌లో ఈ బైక్ సర్వీసులను ఓలా ప్రారంభించింది. ఈ-బైక్ చార్జీలు మొదటి 5 కి.మీకు రూ.25, 10 కి.మీ రూ.50, 15 కి.మీకు రూ.75 చొప్పున నిర్ణయించారు. ఈ లెక్కన ప్రతి కి.మీకు రూ.5 చొప్పున ఈ-బైక్ రైడ్ చార్జీ ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే ఈ-బైక్‌ల సంఖ్య పెంచుతామని ఓలా మొబిలిటీ సీఈవో హేమంత్ భక్షి తెలిపారు.



### చుక్కలాంటి అమ్మాయి...

బంజారాహిల్స్‌లో శనివారం ఓ సెలూన్ ప్రారంభోత్సవంలో బ్లాక్ డ్రెస్‌లో తళుక్కుమన్న నటి, యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్ స్రవంతి చొక్కారపు -సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ)





### క్రికెట్ క్రేజ్.. కిక్కిరిసిన స్టేడియం

నగరంలో క్రికెట్ క్రేజ్ అంతా ఇంత కాదు. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న భారత్ ఇంగ్లండ్ జట్ల మధ్య టెస్ట్ మ్యాచ్‌కు ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. శనివారం మూడో రోజు 25వేలకు పైగా హాజరవడంతో స్టేడియం కిక్కిరిసిపోయింది.



